DD9 వార్త
తెలుగు దినపత్రిక

DD9 Vaartha

ఆదివారం
17-05-2026
హైదరాబాద్





# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం : సీపీ సాయి చైతన్య

- **గంజాయి వినియోగదారులు, రౌడీషీటర్లకు సీపీ సాయి చైతన్య కౌన్సిలింగ్**

**నిజామాబాద్ జిల్లా, మే 16(డీడీ9 వార్త) :**

తెలంగాణ రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కఠిన నిఘా ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం జిల్లా పోలీస్ శాఖ, ఈగల్ టీం సంయుక్త ఆధ్వర్యంలో నిజామాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రత్యేక అవగాహన, కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య గతంలో గంజాయి, డ్రగ్స్ రవాణా వినియోగం కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులతో పాటు రౌడీ షీటర్లు, అనుమానితులకు స్వయంగా ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు అంధకారమవడమే కాకుండా, వారి కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా రోడ్డున పడే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్ వాడకం ఆరోగ్యానికి చేటు చేయడమే కాకుండా చట్టప్రకారం తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు. గతంలో కేసుల్లో ఇరుక్కున్న వారు తమ ప్రవర్తనను మార్చుకుని సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా జీవించాలని హితవు పలికారు. బుద్ధి మార్చుకోకుండా మళ్లీ ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద జైలుకు పంపడం ఖాయమని ఆయన గట్టిగా హెచ్చరించారు. జిల్లాలోని విద్యాసంస్థలు, హాస్టళ్లు, పబ్లిక్ ప్రదేశాల వద్ద నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువు, ఉపాధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజలు కూడా సామాజిక బాధ్యతగా తమ పరిసరాల్లో గంజాయి విక్రయాలుగానీ, అనుమానాస్పద కదలికలుగానీ గమనిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. అనంతరం ఈగల్ టీం, పోలీస్ సిబ్బంది అక్కడకు వచ్చిన అనుమానితులకు ప్రత్యేక కిట్లతో డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కొంతమందికి డ్రగ్స్ వినియోగించినట్లు పాజిటివ్ అని తేలడంతో, వారిపై వెంటనే చట్టప్రకారం కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (ఏఆర్) రామ్ చంద్రరావు, ఏసీపీ ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఈగల్ టీం డీఎస్పీ ఎం. సోమనాథం, హోమ్ గార్డ్ ఏసీపీ కె. దీపక్ చంద్ర, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ కె. శ్రీధర్ రెడ్డి, నిజామాబాద్ టౌన్ సీఐ శ్రీనివాస రాజ్, రూరల్ సీఐలు ఎన్. సురేష్‌కుమార్, బి. శ్రీనివాస్, డిచ్‌పల్లి సీఐ కె. వినోద్, ధర్పల్లి సీఐ భిక్షపతితో పాటు నిజామాబాద్ డివిజన్ ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఉపాధి ఆధారిత కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు : నరాల సుధాకర్

**నిజామాబాద్ జిల్లా, మే 16(డీడీ9 వార్త) :**

మారుతున్న కాలానికి అనుగుణంగా, రాబోయే కాలంలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే సరికొత్త కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుండి పరిచయం చేస్తున్నట్లు నిజామాబాద్‌లోని కేర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ తెలిపారు. నిజామాబాద్‌లోని తిలక్ గార్డెన్ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 21 సంవత్సరాలుగా కేర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అత్యుత్తమమైన విద్యను అందిస్తూ, ఎంతో మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దిందని ఆయన గుర్తుచేశారు. కేవలం చదువులోనే కాకుండా క్రీడారంగంలోనూ ప్రతిభను ప్రోత్సహిస్తూ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేసిన ఘనత తమ విద్యా సంస్థకు దక్కిందని ఆయన ఈ సందర్భంగా గర్వంగా ప్రకటించారు. విద్యార్థుల భవిష్యత్తుకు పూర్తి భరోసా కల్పించడమే ధ్యేయంగా ఈ ఏడాది నుండి సరికొత్తగా బీఎస్సీ ఎమ్ఎల్టీ, బీఎస్సీ డిజిటల్ మార్కెటింగ్, బీఎస్సీ న్యూట్రిషన్, బీఎస్సీ డేటా సైన్స్, బీఏ (హెచ్ఈపీ) వంటి వినూత్న కోర్సులను అందుబాటులోకి తెచ్చినట్లు సుధాకర్ వివరించారు. వీటితో పాటు సాంప్రదాయ కోర్సులైన బీబీఏ, బీసీఏ, బీఎస్సీ బీజెడ్‌సీ మరియు అన్ని రకాల కంప్యూటర్ సైన్స్ కోర్సులు కూడా యధావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. విద్యార్థులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కేర్ డిగ్రీ కాలేజీలో చేరి తమ ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణతో పాటు ఇన్‌ఛార్జ్‌లు సందేశ్, సందీప్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. కోర్సుల వివరాలు, అడ్మిషన్ల కొరకు నిజామాబాద్ బస్టాండ్ సమీపంలోని స్టేషన్ రోడ్డులో గల తిలక్ గార్డెన్ కాంప్లెక్స్‌లోని కళాశాల ప్రాంగణంలో లేదా 9949925676, 9951382993, 9949460640 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

# కాంట్రాక్ట్ ప్రాతిపదికన ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగం

**నిజామాబాద్ జిల్లా, మే 16(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఏఆర్టీ సెంటర్‌లో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాన్ని కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ లాబొరేటరీ టెక్నాలజీలో డిప్లొమా లేదా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 18వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల లోపు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఐదవ అంతస్తులోని ఏఆర్టీ సెంటర్ రూమ్ నెంబర్ 528 లో దరఖాస్తు ఫారాలను నేరుగా పొందవచ్చు. అభ్యర్థులు తాము పూర్తి చేసిన దరఖాస్తులను అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో జతచేసి, తిరిగి అదే కార్యాలయంలో ఈ నెల 21వ తేదీ సాయంత్రం 4.00 గంటల లోపు సమర్పించాల్సి ఉంటుందని వెల్లడించారు.

# జిల్లాలో మాతృ మరణాలు శూన్యమే లక్ష్యం : డీఎంహెచ్ఓ రాజశ్రీ

**నిజామాబాద్ జిల్లా, మే 16(డీడీ9 వార్త) :**


జిల్లాలో మాతృ మరణాలను పూర్తిగా నివారించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మాతృ మరణాలపై నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంసీహెచ్ సూపర్వైజర్లు ప్రతి గర్భిణీ స్త్రీని 12 వారాల లోపే నమోదు చేయడంతో పాటు కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేయించేలా బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. గర్భిణులకు ధనుర్వాతం రాకుండా సకాలంలో టీకాలు ఇప్పించాలని, ప్రతి ఒక్కరి ఎత్తు, బరువు, రక్తపోటు (బీపీ), హిమోగ్లోబిన్ (రక్తహీనత), ప్లేట్‌లెట్స్ పరీక్షలు నిర్వహించి ముందస్తు నివారణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ముఖ్యంగా ప్రమాదకరమైన లక్షణాలున్న గర్భిణులను (హైరిస్క్) ప్రత్యేకంగా గుర్తించి, వారిని స్త్రీ వైద్య నిపుణులు అందుబాటులో ఉండే ఉన్నత ఆసుపత్రులకు ప్రసవాలకై రిఫర్ చేయాలని సూచించారు. ప్రసవ సమయంలో ఆశా కార్యకర్తలు గర్భిణుల వెంట తప్పకుండా ఉంటూ సాధారణ ప్రసవాలు అయ్యేలా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. 'మదర్ ఇన్ మదర్ అవుట్' విధానం ద్వారా గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఎల్ఎమ్పీ, ఈడీడీ వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. కుటుంబ సభ్యుల నిర్లక్ష్యం వల్ల గానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల గానీ ఏ ఒక్క మాతృ మరణం సంభవించినా సహించేది లేదని డాక్టర్ రాజశ్రీ హెచ్చరించారు. అనివార్య కారణాల వల్ల ఎక్కడైనా మరణం సంభవిస్తే.. గర్భిణీ ఇల్లు దాటినప్పటి నుండి పొందిన చికిత్స, ఉన్నత ఆసుపత్రికి రిఫర్ చేసిన వివరాలతో కూడిన పూర్తి డాక్యుమెంటేషన్‌ను సేకరించాలని ఆదేశించారు. ఆసుపత్రి మరియు సామాజిక స్థాయిల్లో ఆడిట్ నిర్వహించి, పూర్తి సమాచారాన్ని నిర్ణీత ఫార్మాట్‌లో పొందుపరచాలన్నారు. ఇటీవలి కాలంలో మాతృ మరణాలు నమోదైన మోస్రా, పెగడపల్లి, ఇందల్వాయి, చౌట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బందితో ఆమె ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ రవీందర్, డాక్టర్ సికందర్ నాయక్, డాక్టర్ సమత, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ అరుణ రేఖ, అనస్థీషియా వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ శిఖరా, డాక్టర్ సుప్రియ, ఏఎస్ఓ రాజేశ్వర్, డీహెచ్ఈ వెంకటేశ్వర్లు, వివిధ పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




# వారంలో 169 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

- **రూ.10.80 లక్షల జరిమానా**

**నిజామాబాద్ జిల్లా, మే 16(డీడీ9 వార్త) :**




నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గడిచిన వారంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 169 మంది పట్టుబడగా, వారికి కోర్టులు రూ.10.80 లక్షల భారీ జరిమానా విధించడంతో పాటు ఏడుగురికి వారం రోజుల జైలు శిక్ష ఖరారు చేసినట్లు జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లతో పాటు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ నెల 11 నుండి 16వ తేదీ వరకు పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిని నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ కోర్టుల్లో హాజరుపరచగా న్యాయస్థానాలు ఈ మేరకు తీర్పునిచ్చినట్లు సీపీ వివరించారు. లీటర్ రక్తంలో ఉండాల్సిన పరిమితి కంటే ఎక్కువ మొత్తంలో మద్యం సేవించి చాలా మంది వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలకు వాహనదారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, అటువంటి సమయాల్లో ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ కూడా లభించదని సీపీ స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిపోయిన వారి డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తామని, ఒకసారి కంటే ఎక్కువ సార్లు పట్టుబడితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. సవరించిన మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం మొదటిసారి పట్టుబడితే రూ.10 వేల జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష, రెండోసారి దొరికితే రూ.15 వేల జరిమానా లేదా జైలు శిక్ష విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. మైనర్లు తాగి వాహనాలు నడిపితే వారిపైనే కాకుండా వాహన యజమానులపై కూడా చార్జ్‌షీట్ నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. వాహనదారులు ఎల్లప్పుడూ వాహన పత్రాలను సక్రమంగా తమ వద్ద ఉంచుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీపీ సాయి చైతన్య హితవు పలికారు.

# సారంగాపూర్‌లో పేకాట స్థావరంపై 'చీతా ఫోర్స్' మెరుపు దాడి

- **ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్..**
- **నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం**

**నిజామాబాద్ జిల్లా, మే 16(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ 6వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగాపూర్ ప్రాంతంలో గల జిల్లా జైలు సమీపంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శనివారం చీతా ఫోర్స్ సిబ్బంది మెరుపు దాడి చేసి ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచినట్లు పోలీసులు తెలిపారు. ఇందులో భాగంగా సీసీఎస్ ఏసీపీ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో చీతా ఫోర్స్ సిబ్బందికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బహిరంగంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకుని, వారి వద్ద నుండి రూ.12,530 నగదుతో పాటు 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం 6వ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు. కమిషనరేట్ పరిధిలో పేకాట, గుట్కా, గంజాయి, డ్రగ్స్ వంటి ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు. ప్రజలు కూడా బాధ్యతగా తమ పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా పేకాట స్థావరాలుగానీ, గంజాయి అమ్మకాలుగానీ లేదా ఇతర అనుమానాస్పద అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఈ సందర్భంగా పోలీస్ శాఖ కోరింది.



# సాలుర క్యాంప్‌లో ఉపాధి పనులు, ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 16(డీడీ9 వార్త) :**

సాలూర క్యాంప్ గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులతో పాటు జనాభా గణన ప్రక్రియను శనివారం సాలూర మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయన గ్రామంలోని ఉపాధి హామీ పనుల స్థలాన్ని సందర్శించి కూలీల హాజరును, పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో.. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో కొనసాగుతున్న 'జనాభా గణన 2027' వెరిఫికేషన్ ప్రక్రియను పర్యవేక్షించి, వివరాల నమోదులో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్ అరుణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రవి, ఫీల్డ్ అసిస్టెంట్ కరీం తదితరులు పాల్గొన్నారు.



# కమిషనరేట్ పరిధిలో ఆంక్షలు..

- **నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు!**

**నిజామాబాద్ జిల్లా, మే 16(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతే ధ్యేయంగా ఈ నెల 16 నుండి 31వ తేదీ వరకు అమల్లో ఉండేలా పలు కఠిన నిబంధనలు, ఆంక్షలను విధిస్తూ జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య శనివారం ఒక ప్రకటనలో అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజలకు ఆటంకం కలిగించేలా జనరద్దీ ప్రాంతాలు, పార్కులు, ప్రభుత్వ భవనాల వద్ద విగ్రహాల ప్రతిష్టాపనలు చేయరాదని, వీటికి కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ అనుమతి తప్పనిసరని స్పష్టం చేశారు. శబ్ద కాలుష్య నియంత్రణలో భాగంగా రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు డీజే సౌండ్ సిస్టమ్స్ వాడకాన్ని పూర్తిగా నిషేధించామని, నివాస, వాణిజ్య ప్రాంతాల్లో రాత్రి వేళల్లో శబ్ద తీవ్రత 55 డెసిబెల్స్ మించకూడదని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో అనుమతి లేకుండా ఊరేగింపులు, సభలు నిర్వహించరాదని, 500 మందితో కూడిన సమావేశాలకు ఏసీపీ అనుమతి, అంతకంటే ఎక్కువ మంది ఉండే కార్యక్రమాలకు 72 గంటల ముందే సీపీ అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, హోటళ్ల వద్ద భద్రతా నిబంధనలు పాటిస్తూ ప్రజలు క్యూ పద్ధతిని అనుసరించేలా నిర్వాహకులు చర్యలు చేపట్టాలన్నారు. డ్రోన్ల వినియోగం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉన్నందున ప్రభుత్వ సంస్థలు, ఏవియేషన్ అధికారుల ముందస్తు క్లియరెన్స్ లేకుండా వాటిని ఎగరవేయరాదని సీపీ స్పష్టం చేశారు. అలాగే జిల్లాలో నిరుద్యోగులను మోసం చేస్తున్న నకిలీ గల్ఫ్ ఏజెంట్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వారికి ఇళ్లు అద్దెకు ఇచ్చే ముందు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. థియేటర్లలో 'ఎ' (పెద్దలకు మాత్రమే) సర్టిఫికెట్ ఉన్న సినిమాలకు మైనర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల మహిళలు, పిల్లలకు ఇబ్బందులు ఎదురవుతున్నందున రోడ్లపై మద్యపానాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలోని ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలను సీపీ ఆదేశించారు. మే 31 వరకు అమలులో ఉండే ఈ ఉత్తర్వుల విజయవంతానికి ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.



